భారత భూ భాగం మీద.... స్వదేశంలో అడుగు పెట్టే సరికి మనసు ప్రశాంతంగా... హాయిగా... ఆనందంగా అనిపించింది.

పదేళ్ళ క్రితం చదువు పేరుతో బాబాయ్ తన దగ్గరకు తీసుకుపోయాడు. దేశం కాని దేశంలో ... పరాయి ప్రభుత్వం పంచన పరదేశియై చదువు వెలగబెట్టాడు తనిన్నాళ్ళూ.

నిజంగా –

ఈ పదేళ్ళు ఎంత చిత్ర క్షోభననుభవించాడు తను?!

తల్లిని .. తండ్రిని .. తన వాళ్ళనందర్ని ఒదిలేసి బాబాయ్‌కి తను... తనకి బాబాయ్ ... ఒకరికొకరు తోడుగా కాలం గడిపారు ఇన్నాళ్ళూ.

బాబాయ్ పిన్ని పోయాక అయినా ఉద్యోగానికి రాజీనామా చేసి ఇండియా తిరిగి వచ్చెయ్యొచ్చు. కానీ, బాబాయ్ కెందుకో స్వదేశమన్నా ... స్వగ్రామమన్నా తగని మంట!

చదువు పూర్తయింది.

ఇక తనకక్కడ అరక్షణం కూడా నిలువ బుద్ధి కాలేదు. బాబాయ్ తనకి ఉద్యోగాన్వేషణ ప్రారంభించేసరికి తనే ససేమిరా ఇండియా వెళ్ళాలని పట్టుబట్టి బయల్దేరాడు.

తనూ తండ్రికి ఒక్కడే వారసుడు.

తండ్రి తరువాత ఆస్థి... అధికారం తనే కాపాడుకోవాలి. పై దేశంలో పైసల కోసం పరాయి నీడన తల దాచుకోవడం నాకు సుతరామూ ఇష్టం లేదు

బొంబాయిలో విమానం దిగి వెంటనే రాజమండ్రి చేరుకున్నాను. నా కోసం తండ్రి... తల్లి... తమ ఫ్యాక్టరి ఉద్యోగులు ఎందరు .... ఎన్ని విధాలుగా స్వాగతం పలికారు?

రైల్వే స్టేషనంతా తన రాకతో కొత్త అందాలు సంతరించుకుంది. ఆ రోజు దిన పత్రికలన్నీ తన ఆగమనానికి ఆశీర్వాదాలు పలికాయి.

నేను వూర్లో అడుగు పెట్టీ పెట్టగానే తండ్రి ఆఫీసు అధికారం.... ఆస్థి .... నా చేతిలో పెట్టాడు.

"సారీ! డాడీ! నేను ఈనెల రోజులూ ఈ వూరు ... ఈ ప్రాంతం ... మన ఫ్యాక్టరి ... నా పాత ప్రాణమిత్రులు అందర్ని కలసి నా అనుభూతుల్ని ... అనుభవాలని నెమర వేసుకున్నాక .... అప్పుడు .... మిమ్మల్ని మీ బాధ్యతల నుండి విముక్తున్ని చేస్తాను. అభ్యంతరం లేదు కదా!"

నా అభిప్రాయానికి అమ్మ కూడా ఆశ్చర్యపోయింది.

ఆ సాయంత్రం –

ఫ్యాక్టరిలో డిన్నర్ ఏర్పాటు చేసాడు తండ్రి. ఆ వూర్లో ... ఆ పట్టణంలో పెద్ద ... పెద్ద వ్యాపారస్థులందరూ విమానాల్లాంటి కారుల మీద రాణీల్లాంటి భార్యమణులతో సూర్యుడి వెలుగు జిలుగులు అద్దుకున్నట్టూ అందరూ మెరుపులతో మైమరపించే సుగంధాన్ని వెదజల్లుతూ ఫ్యాక్టరి ఆవరణలో అడుగు పెట్టారు.

అందర్లూ –

డబ్బున్న మహానుభావులే!

కానీ,

తమ ఆస్థి ఇంత ఎదగడానికి కారణభూతులు ... తమ ఫ్యాక్టరి ఇంత ఉన్నత స్థాయికి చేరుకోవటానికి తమ జీవితాల్ని సమిధలు చేసిన ఫ్యాక్టరి వర్కర్సు ఏరి?! రారేం?!

డాడీ దగ్గరకు వెళ్ళి అదే విషయం అడిగాను.

"వర్కర్సా?! వాళ్ళా! వాళ్ళెందుకురా ఈ పార్టీకి. ఇదంతా మన ఫంక్షన్. డబ్బున్న వాళ్ళు విందు భోజనాలివి. ఇందులో – ఈ ఫంక్షన్‌లో – ఇంత మంది కోటీశ్వరుల మధ్య కాణీకి టికానాలేని ఆ వర్కర్సు వచ్చి కూర్చుని సహపంక్తి భోజనం చేస్తే ఏమైనా ఉందా?!"

"డాడీ!"

నాలో నాకు తెలియకుండానే ఆవేశం కట్టలు త్రెంచుకుంది. "ఛీ! ఏం సంస్కారం వీళ్ళది. ఈ దేశం ఇలా తగలబడ్డానికి ఈ రాష్ట్రం ఇలా రాతి యుగానికి తరలి వెళ్ళడానికి కారణం వీళ్ళే!

తన తండ్రి లాంటి బూర్జువా సిద్ధాంతాల వాళ్ళు ఈ దేశంలో ఉన్నంత కాలం ఈ ప్రగతి గతి ఇంతే!

డిన్నర్ సహించక ఇంటికి వచ్చి పడుకున్నాను.

ఆ మర్నాడు –!

గోదావరి ఒడ్డుకు వెళ్ళాను. అలా గోదావరి గట్టున నడుచుకుంటూ రైల్వే స్టేషన్ వరకూ వెళ్ళాను. ఆ తర్వాత నేను చదువుకున్న స్కూలుకు ... కాలేజీకి వెళ్ళాను.

అప్పటికి .... ఇప్పటికి ఒకేలా ఉన్నాయి.

ఏ మాత్రం మార్పు లేదు.

తనే పెద్ద వాడయ్యాడు!

ఆ సాయంత్రం పాత స్నేహితుల్ని చాలా మందిని కలిసాను. అందరూ పెళ్ళిళ్ళయి సంసారాలు సాగిస్తున్నారు.

మునుపటి ఉత్సాహం ... ఉద్రేకం ఎవరిలోనూ మచ్చుకైనా కానరావటం లేదు.

అందరూ కలిసారు.

కానీ, ప్రభాకరం... ప్రభాకరం... తన ప్రాణ స్నేహితుడు... తన చిన్ననాటి మిత్రుడు కనిపించలేదు.

ప్రభాకరం!

ఏమయ్యాడు? ఎవర్నడిగినా .... ఎందర్ని అడిగినా ఎవరికీ తెలీదన్నారు. వాళ్ళింటికి వెళ్తే .... ఆ ఇల్లు ఎవరో మార్వాడీ కొనేసుకున్నాడట!

ఆ రాత్రి నా మనసు నిండా ప్రభాకరమే!

ప్రభాకరం ... తనూ ఎంత అన్యోన్యంగా తిరిగేవారు! ఎంత ఆనందంగా గడిపేవారు?!

నేనడిగిన గడువు నెలరోజులూ గడిచిపోయాయి.

ఫ్యాక్టరి అజమాయిషీ నా చేతి కొచ్చింది.

సంవత్సరం తిరక్కుండానే ఫ్యాక్టరి నాలుగింతలు పెద్దదయింది. నాలోనూ వ్యాపార లక్షణాలు వూడలమర్రిలా జడలు అల్లుతున్నాయి.

ఆ రోజు –

విదేశీయులతో ఫ్యాక్టరి ప్రోడక్ట్ విషయమై చర్చించడానికి హోటల్‌కు బయలుదేరాను

కారు దగ్గర కొచ్చేసరికి ఎవరో ఓ మధ్య వయస్కుడు కారు తుడుస్తున్నాడు.

డ్రైవర్ సిగరెట్టు త్రాగుతున్నాడు ఓ చెట్టు క్రింద.

నన్ను చూస్తూనే సిగరెట్టు ఓ మూలన విసిరేసి పరుగు ... పరుగున వచ్చాడు డ్రైవర్.

డోర్ తెరిచి పట్టుకున్నాడు.

నాతో పాటు నా వెనుకే పరుగున వచ్చాడు సెక్రటరి. కారులో కూర్చొని ఇంపార్టెంట్ లెటర్ డిక్టేట్ చేసాను.

నా చేతి సైగకు కారు స్టార్ట్ చేసాడు డ్రైవర్.

అప్పుడు చూసాను అతన్ని.

నా కారు తుడిచిన అతని మొహం డ్రైవర్ ప్రక్కనున్న అద్దంలో కన్పించింది.

మాసిన గెడ్డం ... బక్క చిక్కిన మొహం ... లోతుకు పోయి పీక్కుపోయినట్టున్న కళ్ళు....

నీరసంగా... నిర్జీవంగా ఉన్నాడతను.

ఎవరతను?

ఎక్కడో చూసిన జ్ఞాపకం?!

"అతను క్రొత్తగా డ్యూటీలో చేరాడా?!" డ్రైవర్‌ని ప్రశ్నించాను.

"ఎవరు సాబ్!"

"అదే! మన కారు తుడిచాడే అతను." ఎటో చూస్తూ పరధ్యాన్నంగా అన్నాను.

"అవును సాబ్! మేనేజర్ గారు ఆయన్ని నెల క్రితం రోజు వారి కూలీకి ఎపాయింట్ చేసారు." అన్నాడు డ్రైవర్.

ఆ రాత్రి –

నా కెందుకో నిద్ర పట్టలేదు.

నా మనసులో ఏదో అల్లకల్లోలం!

అతన్ని ఎక్కడో చూసినట్టూ ఉంది? ఎంతో పరిచయమున్న వ్యక్తిలాగా కన్పిస్తున్నా డతను? ఎవరు?!

ఉదయం లేస్తూనే ఆఫీసుకు వెళ్ళాను.

మేనేజర్ని కేకేసి అతని విషయం ప్రశ్నించాను.

"అతని పేరు ప్రభాకరం సార్! క్రొత్తగా ఈ వూరొచ్చారట." మేనేజర్ చెప్పాడు.

ప్రభాకరం పేరు వినేసరికి ఒక్కసారి షాకయ్యాను

తన ప్రాణ స్నేహితుడు ప్రభాకరం కాదు కదా!

ఛీ! ఛీ!

తన స్నేహితుడు ఇంత దీనస్థితికి రాడు. ఇతను ప్రభాకరం కాదు.

కాన్ఫరెన్సుకు వెళ్ళాల్సిన పని పడి కారు దగ్గరకు వెళ్ళాను హడావిడిగా. డ్రైవర్ రెడీగా ఉన్నాడు.

మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడతను.

అతన్ని పిలవాలనిపించింది.

కాని, నా మనసెందుకో ఎదరు తిరుగుతోంది.

మేనేజర్.. సెక్రటరి .. డ్రైవర్ .. అందరూ నాకేసి పరీక్షగా చూస్తున్నారు.

కారులో కూర్చోగానే వెళ్ళమని సైగ చేసే తను... ఈ రోజు ఎందుకు సంశయంతో.. సంధిగ్ధంతో సతమతమౌతున్నాడో ఎవరికీ అర్ధం కావటం లేదు.

అతన్ని పిలచి పరిశీలించాలనిపించింది.

కానీ, ఎందుకో?! గిల్టీగా ఫీలవ్వాల్సి వస్తోంది.

బూట్లు పాడయి నట్టున్నాయి. బ్రెష్ పట్టుకు రమ్మనండి." అన్నాను సెక్రటరితో

అతన్నే కేకేసాడు డ్రైవర్.

పాపం! అతను నీళ్ళగొట్టాం అక్కడే వదిలేసి పరుగు పరుగున వచ్చాడు.

సందేహం లేదు!

ప్రభాకరమే!

"ప్రభాకరం!" నా మనసు మూగగా రోదించింది.



పరుగున వెళ్ళి ఆలింగనం చేసుకోవాలనిపించింది.

కానీ!

తను ఈ ఫ్యాక్టరీకి అధికారి. ఈ వూళ్ళో...... ఈ పట్టణంలో మకుటంలేని మహారాజు!

గదిలోకి పిలిచి ప్రభాకరంతో కష్ట సుఖాలు మాట్లాడాలనిపించింది. కానీ, టైం లేదు.

అతను మా దగ్గరకు వచ్చాడు.

మేనేజర్ నా బూట్లని బ్రెష్‌తో షైన్ చేయమన్నాడు.

"నో!" అప్రయత్నంగా అన్నాను.

"ఫర్వాలేదు సార్!.... అరేయ్! ఫేంట్‌కి బ్రెష్ తగలకుండా జాగ్రత్తగా బూట్లను క్లీన్ చెయ్యి!" సెక్రటరి అతనికి. ... ప్రభాకరానికి చెప్పాడు.

మరేం మాట్లాడలేకపోయాను.

కారులో కూర్చున్నానే గాని నా మనసు మనసులో లేదు. అన్యమనస్కంగానే కాన్వరెన్సులో పాల్గొని తిరుగుముఖం పట్టాను.

రాత్రి పన్నెండవుతోంది.

డ్రైవర్‌ని దార్లో వదిలేసాను. పాపం! అతను కూడా ఉదయం నుండీ నాతో నే జపం చేసాడు

ఇంటికి వెళ్ళి హాయిగా రెస్టు తీసుకోవాలి!

కారు నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాను.

కారు షడన్‌గా ఆగిపోయింది.

ఎంత సార్ట్ చేసినా స్టార్ట్ కావటంలేదు. పెట్రోలు ఉంది. బోనెట్ ఎత్తి చూసాను. ఎక్కడా ట్రబుల్ లేదు

ఎవరైనా కొంచెం త్రోస్తే స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది

చీకట్లో ఒకతను వెళ్ళిపోతూ కన్పించాడు.

చప్పట్లు కొట్టి కేకేసాను

అతను శవంలా కదిలి వచ్చాడు

ప్రభాకరం!

"ప్రభాకర్!" బాధగా అన్నాను

"ఎవరుసార్! మీరు! కారు త్రోయమంటారా!" అడిగాడు.

"ప్రభాకరు! నేన్రా! నేను. నీ స్నేహితుడ్నిరా! నీ ప్రాణ స్నేహితుడ్ని" ఉద్రేకంగా అన్నాను.

"క్షమించాలి సార్! నా పేరు ప్రభాకరం కాదు. నాకు "ప్రాణ" మిచ్చే స్నేహితు లెవరూ లేరు సార్!" అతను మూలుగుతున్నట్టు అన్నాడు.

"ప్రభాకరం!"

'ఛీ' సర్దుకున్నాను.

"సార్! మీకేం మతి చలించలేదుకదా! నా పేరు ప్రభాకరం కాదు. పదండి. కారు ఎక్కండి. నాకు పనుంది" అత నన్నాడు.

కారు ఎక్కి కూర్చున్నాను.

ఇతను నిజంగా ప్రభాకరం కాదా!"

ఏమో!!

గుండె ధిటవు పరచుకన్నాను.

కారు స్టార్ట్ అయింది.

థెంక్స్ చెప్పకుండానే...... అన్యమనస్కంగానే కారు ముందుకు పరుగందుకుంది. అప్రయత్నంగా అతనికేసి వెనక్కి తిరిగి చూసాను.

చెయ్యి వూపుతూ నిలబడ్డాడతను.

"నో! వాడు.... వాడు ప్రభాకరమే!"

నా గుండె ఆనందంతో అరిచింది.

కారు ఆపి దిగాను.

వాడు నాకేసి ఆనందంగా పరిగెట్టుకొస్తున్నాడు.

నేనూ నా ఆతృతని అణచుకోలేకపోయాను.

గోదావరి ఒడ్డున..... ఇసుక తిన్నెలమీద పరుగులెట్టి ఇద్దరం చెట్టా పట్టా లేసుకు తిరిగిన రోజులు కళ్ళల్లో మెదిలాయి.

పరుగున వెళ్ళి ప్రభాకరాన్ని ఆలింగనం చేసుకున్నాను.

"క్షమించరా!" అన్నాడు ఏడుస్తూ ప్రభాకరం.

'నన్నే నువ్వు క్షమించాల్రా?" అన్నాను అక్రోషంతో!

ఇప్పుడు-

నేను ఏ ఫ్యాక్టరీకి అధికారిని కాను.

ఏ సంస్థకి మేనేజింగ్ డైరెక్టర్ని కాను.

ఆ ఉదయం వరకూ ప్రభాకరం నేనూ అక్కడే..... అలాగే నిలబడి కబుర్లాడుకుంటూ ఉండిపోయాం! □

